# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కౌలు రైతులందరికి రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు బ్యాంకర్లను ఆదేశించారు.**
2. **తెలుగు దేశం పార్టీ కి చెందిన ప్రజాప్రతినిధులతో పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.**
3. **నిత్యవసర సరుకులను.. అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.**
4. **ఈనెల 22, 23 తేదీల్లో అమరావతిలో జాతీయ డ్రోన్ సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ కార్యదర్శి సురేష్ కుమార్ తెలిపారు.**
5. **రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.**

==========================

కౌలు రైతులందరికి రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు బ్యాంకర్లను ఆదేశించారు. సచివాలయంలో నిన్న నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేవలం 2 లక్షలమంది కౌలు రైతులకే పంట రుణాలు అందాయని, మిగిలిన వారికి కూడా వెంటనే రుణాలు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల ఎకరాలను ప్రకృతి సేద్యం కిందకు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ఇందుకు బ్యాంకర్ల సహకారం అవసరమని మంత్రి అన్నారు.

--------------------------

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో పార్టీకి సంబంధించిన సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ బలోపేతం, పల్లె పండుగ, పంచాయతీరాజ్ వ్యవస్థ పట్టభద్రులు, ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలపై చర్చిస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ.....

వాయిస్...........27 సెకన్లు

---------------------------

నిత్యవసర సరుకులను.. అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సరకుల నాణ్యత, ధరలను పరిశీలించేందుకు విజయవాడలోని రైతు బజార్లను ఆయన నిన్న ఆకస్మిక తనిఖీ చేశారు. రైతుబజారులో సరకుల అమ్మకాల్లో వ్యత్యాసాలపై అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా కిలో కందిపప్పు 67 రూపాయలకు అమ్మకాలు లేకపోవడం గమనించిన మంత్రి మార్కెట్ నిర్వాహకులను నిలదీశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ....మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకే నిత్యావసర సరకులు వినియోగదారులకు అందిస్తున్నామన్నారు. ధరల స్థిరీకరణ విషయంలో ప్రభుత్వ ఆదేశాలను అన్ని రైతుబజార్లు, సంస్థాగత రిటైల్ దుకాణాలు అమలు చేయాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

ఈనెల 22, 23 తేదీల్లో అమరావతిలో జాతీయ డ్రోన్ సదస్సు నిర్వహిస్తు న్నట్లు రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ కార్యదర్శి సురేష్ కుమార్ తెలిపారు. డ్రోన్స్ సాంకేతికత వినియోగంలో రాష్ట్రాన్ని దేశానికి దిక్సూచిగా మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. ఢిల్లీలో పాత్రికేయులతో నిన్న ఆయన మాట్లాడుతూ... డ్రోన్స్ వినియోగంతో పాటు, వాటి తయారీకి... రాష్ట్రాన్ని కేంద్రంగా నిలపాలనే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయం, వైద్యారోగ్యం, శాంతిభద్రతల రంగాలపై ఈ సదస్సు దృష్టి సారించిందని వివరించారు. కాగా డ్రోన్ సదస్సులో భాగంగా విజయవాడలోని పున్నమి ఘాట్ దగ్గర డ్రోన్ ఎయిర్ షో ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

---------------------------

రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవల్లి మండలాల్లో నిన్న నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో మంత్రి పాల్గొని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .....పల్లెలు అభివృద్ధి చెందాలనే ఆలోచనతో ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు.

---------------------------

వచ్చే నవంబర్ ఒకటవ తేదీ నుండి దేశంలో నూతన రైల్వే రిజర్వేషన్ విధానం అమలులోకి రానుంది. ఈ నూతన విధానం కింద రైళ్లలో రిజర్వేషన్లకు ప్రస్తుతం ఉన్న కాలపరిమితిని 120 రోజుల నుండి 60 రోజులకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నట్టు రైల్వే బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే, అక్టోబర్ 31వ తేదీ వరకు చేసిన అన్ని రిజర్వేషన్లు యధాతధంగా ఉంటాయని స్పష్టం చేసింది. విదేశీ పర్యాటకులకు 365 రోజుల రిజర్వేషన్ పరిమితిలో ఎటువంటి మార్పు ఉండదని రైల్వే అధికారులు తెలిపారు.

---------------------------

కాకినాడలో గత నాలుగు రోజులుగా ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాకినాడలో వాతావరణ పరిస్థితులపై మరిన్ని వివరాలు మా ఆకాశవాణి కాకినాడ జిల్లా ప్రతినిధి పి.వరప్రసాద్ అందిస్తారు.

..వాయిస్...25 సెకన్లు

---------------------------

ప్రజల సంక్షేమానికి కృషి చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, దీనికి స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు కూడా అవసరమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. సుజనా ఫౌండేషన్, క్రిస్ప్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'విజయ దీపం' కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'దేశ ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతోందని.. మాతా, శిశు మరణాలను నివారించడానికి అంగన్‌వాడీల ద్వారా పోషకాహారం అందిస్తున్నారని వివరించారు.

విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు సుజనాచౌదరి మాట్లాడుతూ విద్యారంగంలో మార్పులకు అనుగుణంగా పిల్లల శక్తి సామర్థ్యాలను వెలికితీసి, వారికిష్టమైన రంగాల్లో రాణించేలా ప్రోత్సహించడమే 'విజయ దీపం' కార్యక్రమం ఉద్దేశమని వివరించారు.

---------------------------

పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈరోజు నుంచి ఏడు రోజుల పాటు విజయవాడ, గుంటూరు నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈరోజు ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి ఆయన చేరుకుంటారు. రేపు ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారు. 20వ తేదీన ట్రస్ట్‌లో జరగనున్న రైతు నేస్తం 20వ వార్షికోత్సవం, రైతునేస్తం – ముప్పవరపు ఫౌండేషన్ పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు.

---------------------------

ప్రభుత్వాసుపత్రుల్లో నాణ్యమైన సేవలను ఆశించే హక్కు ప్రజలకు ఉందని.. వారి అంచనాల మేరకు పనిచేయడం వైద్య సిబ్బంది బాధ్యతని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రుల నిర్వహణ, వైద్య సేవల పనితీరుపై అమరావతిలో నిన్న మంత్రి సమీక్షించారు. బోధనాసుపత్రుల వారీగా తీసుకున్న చర్యల గురించి అధికారులు మంత్రికి వివరించారు. ఆసుపత్రుల్లో అదనంగా 725 మంది సహాయకులు, 300 మంది స్టాఫ్‌నర్సులు, రూ. 240 కోట్ల విలువైన ఆధునిక వైద్య పరికరాలు అవసరమని వారు తెలిపారు.

---------------------------

భూముల రీ–సర్వేకు కాల పరిమితి విధించకుండా క్రమపద్ధతిలో నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సెస్ కార్యదర్శి మనోజ్ జోషి సూచించారు. ఆయన నిన్న విజయవాడలో భూముల రీ–సర్వేపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. అనంతరం గుంటూరు జిల్లా పిడుగురాళ్ల మండలం చింతలపూడి గ్రామాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. అనంతరం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోదియా, ఆ శాఖ సంబంధిత అధికారులతో మనోజ్‌జోషి సమీక్ష నిర్వహించారు. భూముల రీ–సర్వేలో తొందరపాటు వద్దని ఆయన సూచించారు.. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆయనను వేర్వేరుగా కలుసుకున్నారు.

భూముల రీ–సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు.

---------------------------

రాజధాని అమరావతిలో త్వరలో జాతీయ క్రీడలు నిర్వహిస్తామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని శివనాథ్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో 35వ సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలను నిన్న ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ... 2027లో జాతీయ క్రీడలు నిర్వహించేందుకు అమరావతిలో స్పోర్ట్స్ సిటీని నిర్మిస్తున్నామని తెలిపారు.

---------------------------

లింగంపల్లి నుంచి సికింద్రాబాద్, గుంటూరు మీదుగా తిరుపతి వెళ్లే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు బయలుదేరే సమయం మారిందని ప్రయాణీకులు ఈ విషయాన్ని గమనించాలని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు లింగంపల్లిలో సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు బయలుదేరి, సికింద్రాబాద్ 6 గంటల 5 నిమిషాలకు, గుంటూరు 10 గంటల 55 నిమిషాలకు, తిరుపతి మరుసటి రోజు తెల్లవారుజామున 5 గంటల 55 నిమిషాలకు చేరుతుందని వెల్లడించారు.

---------------------------

విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో డయేరియాలో మరణించే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుండడంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఈ రోజు గుర్ల గ్రామంలో పర్యటించారు. డయేరియాను అదుపు చేసేందుకు తీసుకుంటున్న చర్యలపై స్థానిక మండల విద్యా శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

======================